ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలి

పుత్లిబౌలిలో ఏఎంఓహెచ్ వెంకటరమణతో కలిసి సమస్యలను తెలుసుకుంటున్న ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్, డిసెంబర్ 21: ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడూ తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్-14 ఏఎంఓహెచ్ వెంకటరమణ తదితర అధికారులతో కలిసి పుత్లి బౌలిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. పుత్లిబౌలి చౌరస్తాలో అక్రమంగా పార్కింగ్ , మూత్ర విసర్జన చేస్తుండడం వలన దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ఆ ప్రాంతంలో వాహనాల అక్రమ పార్కింగ్ లేకుండా చూడాలని సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినా లాభం లేదని అన్నారు. జనవరి 4వ తేదీన గురుద్వార్‌లో పూజలు ఉంటాయని ఆ లోపు పారిశుధ్య సమస్య లేకుండా చేయాలని కోరగా ఏఎంఓహెచ్ వెంకటరమణ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మేధాశక్తిని పెంచడానికి క్రీడలు దోహదం చేస్తాయి

నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ చిరంజీవి, ప్రసాద్‌రావు, డాక్టర్ లక్ష్మయ్య తదితరులు

కాచిగూడ, డిసెంబర్ 21: శరీర దృఢత్వాన్ని, మేధాశక్తిని పెంచడానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.చిరంజీవి అన్నారు. కాచిగూడ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో భాగంగా జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. హైదరాబాద్ జిల్లా జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ప్రసాద్‌రావు, తెలంగాణ జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మయ్య గంగపుత్ర, విఘ్నేశ్, కాచిగూడ కళాశాల పీఈటీ లక్ష్మణ్‌నాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డిపో-1లో.. క్రిస్మస్ వేడుకలు

గౌలిగూడలోని హైదరాబాద్ డిపో-1 ఆవరణలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శనివారం పాస్టర్ టి. అబ్రహం క్రీస్తు సందేశాన్ని వివరించారు. అనంతరం నిర్వహించిన వేడుకలలో డిపో-1 మేనేజర్ బి. క్రిష్ణారెడ్డి కేక్ కట్ చేశారు.

– సుల్తాన్‌బజార్, డిసెంబర్ 21

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తొలి సీఎం కృషి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

వృద్ధురాలిని సంక్షేమ ఫలాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తదితరులు

కాచిగూడ, డిసెంబర్ 21: పేదల కోసం తొలి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు వారి జీవితాల్లో వెలుగులు నింపాయని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గోల్నాక డివిజన్‌లోని శ్యామ్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే కాలేరు తిరుగుతూ.. ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య, విడో, దివ్యాంగుల పెన్షన్లు, ఇతర సంక్షేమ ఫలాలు అందుతున్నాయా..లేదా అనే విషయాలను శనివారం బస్తీలోని వృద్ధులను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలోని అర్హులైన పేదలకు పలు సంక్షేమ పథకాలు అందకపోతే..నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కరానికై కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పేద ప్రజల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వారి జీవనోపాధిని మెరుగు పరచడానికే సంక్షేమ పథకాలను కేసీఆర్ ప్రభుత్వం అందించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి పడిపూజ

గోల్నాక హనుమాన్‌నగర్‌లో నిర్వహించిన పడిపూజలో పాల్గొన్న గురుస్వాములు

అంబర్‌పేట, డిసెంబర్ 21: అయ్యప్పస్వామి మహాపడిపూజ శనివారం ఎం.సతీశ్‌ముదిరాజ్ గురుస్వామి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరిగింది. సుందరం పంతులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాఘవ గురుస్వామి, సతీశ్ గురుస్వామి ల నేతృత్వంలో భజన నిర్వహించారు. గురుస్వాములు రాములు, అశోక్, టి.వెంకటేశ్, తిరుపతిగుప్తా, పండిత్‌ముదిరాజ్, చంద్రమౌళి, బాబుయాదవ్, గోవర్ధన్‌గౌడ్, మహేశ్వరి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెహిదీపట్నం : కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లో శనివారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా జరిగింది. దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు బోగి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన పూజను గురుస్వాములు మణికంఠ, కారింగుల గోపీగౌడ్ నిర్వహించారు.

కాచిగూడ : ధాత్రిక్ వేణుమాధవ్ గురుస్వామి ఆధ్వర్యంలో రామంతాపూర్‌లోని బ్రహ్మంగారి దేవాలయంలో అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని భక్తి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు కాలేరు రాజు, వెంకులు, శ్రీనుస్వామి, వంజరి, భాస్కర్‌రెడ్డిస్వామి, అయ్యప్పస్వాములు హాజరయ్యారు.

ప్రశాంత్‌నగర్‌లో జరిగిన అయ్యప్పపూజలో గురుస్వాములు మణికంఠ, గోపీగౌడ్

అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న కాలేరు రాజు, వెంకులు, శ్రీనుస్వామి

నయనానందకరంగా లాస్య రంజని వార్షికోత్సవాలు

ఆంధ్రనాట్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 21 : లాస్య రంజని క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ దశమ వార్షికోత్సవాలు నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం నయనానందకరంగా జరిగాయి. ప్రముఖ నృత్యగురువు రేఖ గరీషకుర్తి నృత్య శిక్షణలో ఆంధ్రనాట్యాన్ని అవపోసన పట్టిన 28మంది ఔత్సాహిక విద్యార్థులు కుంభహారతి, వినాయక కౌతం, అన్నమాచార్య కీర్తన, దశవతార శబ్దం, కైవరం వంటి అంశాలకు తమదైన శైలిలో నర్తించి ఆహూతుల ప్రశంసలు అందుకున్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత ఉమామహేశ్వరి, కళ పత్రిక ఛీఫ్ ఎడిటర్ మహ్మద్‌రఫీ, విశ్రాంత శాస్త్రవేత్త దేవీప్రసాద్, కేంద్ర సంగీత నాటక అవార్డు గ్రహీత డాక్టర్ కళాకృష్ణ పాల్గొని చిన్నారి కళాకారుల ప్రతిభను, గురువు రేఖ కృషిని తమ ప్రసంగంలో కొనియాడారు.

బ్రాహ్మణ మహా సమ్మేళనానికి రావాలని ఆహ్వానం

బ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించే బ్రాహ్మణ మహా సమ్మేళనంలో పాల్గొనాలని సీఎం రేవంత్‌రెడ్డిని అసోసియేషన్ అధ్యక్షుడు సుశీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ కలిసి ఆహ్వానించారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో సీఎంను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. మన ప్రభుత్వం-మన ప్రగతి పేరుతో అసోసియేషన్ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 29వ తేదీన నగరంలోని రవీంద్రభారతిలో సాయంత్రం నిర్వహించే బ్రాహ్మణ మహా సమ్మేళనంలో రాష్ట్రంలోని అన్ని బ్రాహ్మణ, అర్చక సంఘాలు పాల్గొంటున్నాయని చెప్పారు.

– అంబర్‌పేట, డిసెంబర్ 21

కక్ష కట్టి కేటీఆర్‌పై కేసు బనాయించడం సిగ్గు చేటు

ఎ. అనిత, బీఆర్ఎస్ రెడ్‌హిల్స్ డివిజన్ మహిళా ప్రధాన కార్యదర్శి

అబిడ్స్, డిసెంబర్ 21: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షకట్టి కేసులను బనాయించడం సిగ్గు చేటని బీఆర్ఎస్ పార్టీ రెడ్‌హిల్స్ డివిజన్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఏకుల అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంపై నిలిపిన ఘనత కేటీఆర్‌కు దక్కిందన్నారు. ఈ ఫార్ములా రేసు ఒప్పందం రద్దు చేసుకున్న కారణంగా రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లడంతో పాటు నగరం, రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతిన్నదని అన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను 420 హామీలుగా గాలికి వదిలేశారని విమర్శించారు. వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ఈ అంశాన్ని తెరమీదకు తీసుకు వచ్చారని అన్నారు.

అంతరంగ్ పండుగ కథక్ వేడుక

రవీంద్రభారతి, డిసెంబర్ 21 : థీమ్ యునైటెడ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్‌డీజీలు)ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో కథక్, కళాత్మక వ్యక్తీకరణ యొక్క ఐకానిక్ వేడుక అంతరంగ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో పద్మ విభూషణ్ పండిట్ సహా ప్రదర్శన కళలు ప్రపంచంలో పేరుగాంచిన బిర్జూ మహారాజ్ జీ, ఉమా డోగ్రా, మాలబిక మిత్రా తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కూచిపూడి రంగప్రవేశం

వేదికపై కూచిపూడి రంగప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 21: భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో సప్తరంజని ది సెలస్టియల్ జాయ్ ఆఫ్ డ్యాన్స్ పేరిట ప్రముఖ నృత్యకళాకారిణి డాక్టర్ దీప్తి సరోజిని శనివారం సాయంత్రం కూచిపూడి రంగప్రవేశ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ వ్యవస్థాపకురాలు, నృత్యగురువు పద్మకలల్యాణ్ మార్గదర్శకత్వంలో డాక్టర్ దీప్తి సరోజిని కూచిపూడి నృత్యాంశాలను అవపోసపట్టి తొలి ప్రదర్శనలోనే నర్తించి ఆహూతులనను ఆకట్టుకున్నారు. నాలుగు పదుల వయసులో రెండు సార్లు కాలుకు శస్త్ర చికిత్స జరిగినా పట్టుదలతో నాట్యంపైన ఉన్న మక్కువతో కఠోరసాధన చేసిన దీప్తి ఏడు అంశాలను గంట నలబై ఆయిదు నిమిషాల వ్యవధిలో నిర్విరామంగా నృత్యప్రదర్శన చేసి ఆహూతుల అభినందనలు అందుకున్నారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ మహేశ్‌కుమార్, డిప్యూటీ చైర్మన్ డాక్టర్ జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొని దీప్తి కృషిని ప్రశంసించారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్న చైర్మన్ ఎం.నర్సింహ, ప్రతినిధులు

కాచిగూడ డిసెంబర్ 21: రజకుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. 21 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీలుగా ఉన్నారని, తెలుగు రాష్ట్రాల్లో రజకులను ఎస్సీలుగా గుర్తించలేదని అన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం. నర్సింహ ఆధ్వర్యంలో శనివారం ప్రతినిధులతో కలిసి కేంద్ర మంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. నగరంలోని షేక్‌పేట, పాటిగడ్డ, దేవునికుంట, సనత్‌నగర్,అశోక్‌నగర్, మల్లికార్జున్ ధోబీఘాట్‌లకు కమ్యూనిహాల్స్ నిర్మించి, కాంపౌండ్ వాల్‌ను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కె.హరినాథ్, కె.నర్సింగ్‌రావు, ఎన్. రాజు, జి.గణేశ్, ఎ.రమేశ్‌బాబు, చంద్రమోహన్, పి.కిషన్, పి.శ్రీధర్, జ్యోతి, సునంద, రాజు, సంజయ్, అశోక్‌కుమార్, కె.రాము పాల్గొన్నారు.

నేడు శ్రీ భక్త కనకదాస్ జయంతి వేడుకలు

అబిడ్స్, డిసెంబర్ 21: కురుమల ఆరాధ్య గురువైన శ్రీ కనకదాస్ 537 జయంతి వేడుకలను జియాగూడ జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు జియాగూడ శ్రీ మల్లన్న కురుమ సంఘం అధ్యక్షుడు హన్మంత్ హీరోడే, ప్రధాన కార్యదర్శి అమరనాథ్ హీరోడే అన్నారు. శనివారం కేశవస్వామి మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు శ్రీ శాంతామయ స్వామీజీ, తెలంగాణ కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేషం, ఎంపీ ఈటల రాజేందర్, ఆరేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారని వివరించారు.

ఉస్మానియాను గోషామహల్ స్టేడియంలో నిర్మించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న కోటి శైలేష్ కురుమ తదితరులు

అబిడ్స్, డిసెంబర్ 21: గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖాన నూతన భవనాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోటి శైలేష్ కురుమ కోరారు. ఈ మేరకు గోషామహల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పార్టీ నాయకులు దత్తు, గణేశ్, సల్మాన్‌ఖాన్, వీరేందర్, పశుపతి, రాజు ముదిరాజ్‌లతో కలిసి మాట్లాడుతూ.. గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖాన నిర్మాణ నిర్ణయాన్ని ప్రభుత్వం మార్చుకునేంత వరకు ఆందోళన కార్యక్రమాలను చేపడతామని అన్నారు. ప్రభుత్వం ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా నూతన భవన నిర్మాణానికి సన్నాహాలు చేస్తుండటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉస్మానియా ఆసుపత్రి ప్రస్తుత ఖాళీ స్థలంలో నూతన భవన నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు.

రాయితీ ధరలలో తెలుగు వర్సిటీ పుస్తకాలు

హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో డిసెంబర్ 19నుంచి 29వరకు కొనసాగనున్న 37వ జాతీయ పుస్తక ప్రదర్శనలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన పుస్తకాలను సాహితీ ప్రియులకు రాయితీ ధరలలో అందించాలనే లక్ష్యంతో 146 స్టాల్‌లో అందుబాటులో ఉంచినట్లు వర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు తెలిపారు.

– తెలుగు యూనివర్సిటీ

చైనా మంజా విక్రయ దారుల అరెస్ట్

వివరాలను వెల్లడిస్తున్న ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.శ్రీనివాస్‌తేజ

మెహిదీపట్నం డిసెంబర్ 21: ప్రమాదకర చైనా మాంజాను విక్రయిస్తున్న ముగ్గురిని ఆసిఫ్‌నగర్ పోలీసులు దక్షిణ, పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 4.26లక్షల విలువ చేసే మాంజాను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ విజయ్‌శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి వివరాలను వెల్లడించారు. మంగళ్‌హాట్‌కు చెందిన శంకర్ సింగ్, వినయ్‌రాజ్ సింగ్, అనూప్‌సింగ్‌లు చైనా మాంజాను విక్రస్తున్నట్లు సమాచారం అందడంతో దక్షిణ, పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి శంకర్‌సింగ్‌పై దాడి చేయగా అతడు ఇచ్చిన సమాచారంతో మరో ఇద్దరిని పట్టుకున్నట్లు తెలిపారు. వీరిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తెలుగు ఫాంట్ ఆవిష్కరణ

ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి తదితరులు

రవీంద్రభారతి, డిసెంబర్ 21: శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో శీలా వీర్రాజు చేతివ్రాతతో రూపొందిన 'తెలుగు ఫాంట్' ఆవిష్కరణ, 'మాట్లాడుకోవడానికి మనిషి కావాలి' పుస్తకావిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా నందిని సిధారెడ్డి, ఫాంట్ ఆవిష్కర్త సుధామ, ఫాంట్ డిజైనర్ పురుషోత్తంకుమార్, డా.అమృతలత, పుప్పాల శ్రీరామ్, శీలా సుభద్రాదేవి తదితరులు విచ్చేసి పుస్తకాలను ఆవిష్కరించారు.

అశోక్‌తేజ, మన్నం వెంకటరాయుడులను సత్కరించిన వక్తలు

పురస్కారాలు అందించడం మంచి సంప్రదాయం

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 21 : తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల పరిరక్షణకు కృషి చేస్తున్న విధ్యాంసులను గౌరవించుకోవడం మంచి సంప్రదాయమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి అన్నారు. శాంతా-వసంతాట్రస్టు ఆధ్వర్యంలో శనివారం అబిడ్స్ బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తు హాలులో శనివారం సాయంత్రం ప్రముఖ కవి, సినీ గీతరచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజకు డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారాన్ని, మనసు ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ మన్నం వెంకటరాయుడికి కోడూరు వెంకటరమణారెడ్డి సాహిత్య సేవారత్న పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పురస్కారం కింద ఒక్కొక్కరికీ లక్షరూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు. రమణాచారి, పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య పాలొని మాట్లాడారు.

జాతీయ గణిత దినోత్సవాలు

ప్రొఫెసర్ శ్రీరాములును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ చంద్ర ముఖర్జీ తదితరులు

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 21 : నాంపల్లిలోని ఇందిరాప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ గణిత దినోత్సవాలను నిర్వహించారు. కళాశాల గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ 137వ పుట్టిన రోజు సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే జాతీయ గణిత దినోత్సవాలను పురస్కరించుకొని రామానుజన్ అనంతశ్రేణి, మాయా ప్రపంచం, ఆధునిక గణితంపై వాటి ప్రభావం పోస్టర్ మేకింగ్, పోస్టర్ ప్రజెంటేషన్ కోసం యూజీ ఫిజికల్ సైన్స్ విద్యార్థులు అనే అంశంపై క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 50 మంది విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీసీఈ మాజీ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీరాములు విజేతలను అభినందించారు. ప్రిన్సిపాల్ చంద్ర ముఖర్జీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాంజలి, హెవోడీ శ్రీదేవి, డాక్టర్ మంగరీష్, డాక్టర్ పావని పాల్గొన్నారు.

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై టీటీడీ బోర్డు ప్రకటనను వెనక్కుతీసుకోవాలి

శ్రీనివాస్‌గౌడ్‌తో జాజుల లింగంగౌడ్

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 21: తిరుమల కొండపైన తెలంగాణ భక్తులకు జరుగుతున్న అసౌకర్యాలు, ఇబ్బందులపై మీడియా సమక్షంలో మాట్లాడినందుకు మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్‌పైన టీటీడీ బోర్డు చర్యలు తీసుకుంటామన్న ప్రకటనను వెంటనే వెనక్కు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాజకీయ పార్టీల నాయకులు రాజకీయం కోసం తిరుపతిలో గతంలో అనేక పర్యాయాలు ప్రసంగించిన విషయాన్ని టీటీడీ బోర్డు పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. బలహీన వర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడినందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించడం సమంజసం కాదని అన్నారు.

యోగాతో సమాజ శాంతి

కళాశాలలో యోగా చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ తదితరులు

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 21 : నిత్యం యోగా చేయడం ద్వారా సమాజ శాంతి నెలకొంటుందని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ అన్నారు. శనివారం కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాతో వ్యక్తులకు మంచి అలవాట్లు కలిగి ఉండటంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం ఆధ్మాత్మిక, విద్యాపరమైన విలువలు పెంపొందుతాయని అన్నారు. నిజాం కళాశాల ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. స్రవంతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. ఉపేందర్‌రెడ్డి, ఎస్. రేణుక, పీఆర్‌వో డాక్టర్ ఎస్. కవితాషిండే తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE IX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT : HYDERABAD
O.S. No. 5169 OF 2024
Between:
(1) Sri Aerravelli Srihari, S/o. Late Y.Durgaiah, Aged about 69 Years, Occ: Business, R/o. H.No. 6-3-1185/20, B.S.Maktha Begumpet, Hyderabad, T.S.
(2) Yerravalli Raghunath, S/o. Late Yerravalli Durgaiah, Aged about 63 Years, Occ: Household, R/o. H.No. 11-1-795, D Class, Aghapura, Hyderabad T.S.
...Plaintiff's / Petitioner Nos. 1 & 2.
And
1. The Tahsildar, MRO, Asif Nagar, Hyderabad.
2. All Concerned ...Defendants
To
All Concerned
This is to inform the General Public that the plaintiff have filed the above suit for declaration to declare him as legal heir of deceased **Late Yerravalli Durgaiah.** The said suit is posted on 08-01-2025 at 10.30 A.M. If anybody has any objections kindly appear before the above Hon'ble IX Junior Civil Judge at Hyderabad on 08-01-2025 at 10.30 A.M., either in person or through advocate, failing which the matter will be decided in your absence as per law.
// BY ORDER OF THE COURT //
Sd/- HARI PRASAD, P.PRADEEP KUMAR & KISHORI LAL, Advocate's
Flat No. 803,
8th Floor Raghav Ratna Towers,
Abids, Hyderabad (T.S)-01,
Ph.No. 7777934793.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT : KUSHAIGUDA
O.S.NO. 882 OF 2022
BETWEEN:
SMT. USHA DEVI BALDWA & Others
...PLAINTIFF
AND
SRI P.BAL REDDY & Others
...DEFENDANTS
TO
6. SRI PRASHANTH KUMAR, S/o. Satyanarayana, Aged about 33 Years, Occ: Not known, R/o. H.No. 1-8-702/33/7, Nallakunta, Hyderabad-500 044.
10. SRI G.V.DURGA PRASAD, S/o. G.Veerabhadra Rao, Aged about 58 Years, Occ: Private Service, R/o. 3-7-62/55, New Nallakunta, Hyderabad-500 044.
12. SMT. RAVI MANOHARAMMA, W/o. Ram Reddy, Aged about 89 Years, Occ: Housewife, R/o. 2-2-1105/10, Tilak Nagar, Hyderabad-500 044.
NOTICE
The Plaintiff herein had filed the Suit for Declaration and Consequential Injunction against the Defendants. The Hon'ble Court had ordered for publication of this Notice for appearance of Defendant No.6 and the matter is posted to 02.01.2025. Therefore, you may appear before the Hon'ble Principal District Judge, Medchal-Malkajgiri District at Kushaiguda on 02.01.2025 at 10:30 A.M. either personally or through authorized Counsel or otherwise the matter will be adjudicated in due process of Law.
Hence, this Notice.
[BY ORDER OF THE COURT]
For M/s RESU LAW OFFICE,
Advocates.